

చెట్టు మీద గంజాయి
గతంలో పోలీసుల దాడులతో కొన్నిరోజులుగా గంజాయి సాగు ఇటీవల మళ్లీ బోథ్ మండల వ్యాప్తంగా సరఫరా అవుతోంది. 8లో▸



ముగిసిన హరినామ సప్తాహం
తానూరు మండలంలోని హంగిర్గాలో వారం రోజులుగా జరుగుతున్న అఖండ హరినామ సప్తాహం గురువారం ముగిసింది. 9లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
37.4 /22.4

ఆకాశంలో కొంతమేర మేఘాలు ఉంటాయి. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రత కొనసాగుతుంది. ఉక్కపోత అధికంగా ఉంటుంది.

రంజాన్ వేళలు
ఇఫ్తార్	సహర్
శుక్ర: 6:29	శని: 4:48

జై శ్రీరామ్

- రామనామస్మరణతో మార్మోగిన జిల్లా
- వాడవాడలా రాములోరి కల్యాణం
- కనులారా వీక్షించిన భక్తజనం



సీతారాముల కల్యాణం తిలకిస్తున్న భక్తులు

సీతారాములకు మొక్కుతున్న యువతి

నిర్మల్‌టౌన్: జై శ్రీరామ్.. జైజై శ్రీరామ్.. అంటూ జిల్లా రామనామస్మరణతో మార్మోగింది. వాడ వాడలా సీతారాముల కల్యాణోత్సవాలు కనుల పండువగా జరిగాయి. శ్రీరామనవమిని పురస్కరించుకుని గురువారం జిల్లాలోని రామాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సీతారాముల కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. జిల్లా కేంద్రంలోని బ్రహ్మపురి రాంమందిర్, బాగులవాడ రామాలయం, శాంతినగర్ సీతారామ మందిరాల్లో సీతారాముల కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద పండితుల వేద మంత్రోచ్చరణల మధ్య భక్తులే పెళ్లి పెద్దలుగా సీతారాముల కల్యాణోత్సవం కొనసాగింది. గండి రామన్న సాయిబాబా ఆలయంలో ఆలయ సింగిల్ ట్రస్ట్ చైర్మన్ లక్కడి జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సీతారాముల పల్లకీ సేవ, రామనామ సంకీర్తన, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గతంలో చోటు చేసుకున్న ఘటనల నేపథ్యంలో ఎస్పీ ప్రవీణ్ కుమార్, నిర్మల్ డీఎస్పీ జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ప్రార్థన స్థలాల వద్ద భారీ సంఖ్యలో పోలీసులను మోహరించారు. పోలీసు బందోబస్తు మధ్య శ్రీరామనవమి శోభాయాత్ర ప్రశాంతంగా ముగిసింది.



సీతారాముల కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు



కల్యాణ ఘట్టంలో భక్తులకు మంగళ సూత్రాలు చూపిస్తున్న వేదపండితుడు



సీతమ్మవారికి మాంగల్యధారణ



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రేఖానాయక్

న్యూస్‌రీల్


'ముడుపుల' సూత్రధారులెవరు?
- భైంసా ఐసీడీఎస్‌లో సబార్డినేట్ పోస్టు వ్యవహారం
- ఘటనపై విచారణ జరిపిన అధికారులు

భైంసాటౌన్(ముధోల్): భైంసా ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్ పోస్టు వ్యవహారంలో అసలు సూత్రధారులు ఎవరనే దానిపై గోప్యత కొనసాగుతోంది. కార్యాలయంలో ఇదివరకు తాత్కాలికంగా పనిచేస్తున్న తనను కాదని మరో మహిళకు పోస్టు కట్టబెట్టేందుకు కొందరు టీచర్లు యత్నించారని ఇప్పటికే పనిచేస్తున్న మహిళ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో అధికారులనే తప్పుదోవ పట్టించి పోస్టు కట్టబెట్టే యత్నంపై సీరియస్‌గా తీసుకున్న ఉన్నతాధికారులు ఈ విషయంలో ఎవరి పాత్ర ఉందో తేల్చాల్సిందిగా విచారణకు ఆదేశించారు. ఈ మేరకు ఇటీవల విచారణ అధికారులు భైంసా ఐసీడీఎస్ కార్యాలయంలో ముగ్గురు అంగన్‌వాడీ టీచర్లు, సీడీపీవోను విచారించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామంటూ అధికారులు గోప్యత పాటిస్తున్నారు.

విచారణపై అనుమానాలు

భైంసా ఐసీడీఎస్ కార్యాలయానికి మంజూరైన ఆఫీస్ సబార్డినేట్ పోస్టు కొన్నేళ్లుగా పనిచేస్తున్న మహిళకే కేటాయించాల్సి ఉండగా మరో మహిళకు ఆర్డర్ కాపీ రావడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. ముగ్గురు టీచర్లు తనను కాదని, మరో మహిళకు పోస్టు కట్టబెట్టే యత్నం చేశారని ప్రస్తుతం పనిచేస్తున్న మహిళ ఆరోపిస్తుండగా, తమకేమీ సంబంధం లేదని సదరు టీచర్లు విచారణ అధికారులకు తెలిపినట్లు తెలిసింది. కాగా విచారణ అధికారులపై సైతం కొందరు టీచర్లు, సిబ్బంది అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనా విచారణ అధికారులు ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తే ఎవరి పాత్ర ఉందనే విషయంపై స్పష్టత రానుంది.


ఖానాపూర్‌లో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

ఖానాపూర్: శ్రీరామనవమితో పాటు రంజాన్ పర్వదినాలను పురస్కరించుకుని గురువారం ఖానాపూర్ పట్టణంలో పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్ నుంచి ప్రధాన వీధుల గుండా సాగిన ఫ్లాగ్‌మార్చ్‌లో సీఐ నారాయణ నాయక్, ఎస్సై ఆర్.శంకర్ మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజల్లో భరోసా కల్పించేందుకు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలు మండలాల ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

మీ సేవలను ప్రజలు ఎప్పటికీ మరువరు
- డీఎస్పీ జీవన్‌రెడ్డి



సీఐని సన్మానిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

లక్ష్మణచాంద(నిర్మల్): జిల్లా ప్రజలకు మీరు చేసిన సేవలను ఎప్పటికీ మర్చిపోలేరని నిర్మల్ డీఎస్పీ జీవన్‌రెడ్డి అన్నారు. సోన్ సీఐగా పనిచేసిన రాంనరసింహారెడ్డి ఇటీవల బదిలీపై జయశంకర్ భూపాలపల్లికి వెళ్తున్నారు. ఈ సందర్భంగా గురువారం సోన్ సీఐ కార్యాలయంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన డీఎస్పీ జీవన్‌రెడ్డి సీఐ రాంనరసింహారెడ్డి సేవలను కొనియాడారు. నిర్మల్ డివిజన్‌లో పదేళ్లుగా తమ సేవలను అందించి ప్రజల హృదయాలను గెల్చుకున్నారన్నారు. నిర్మల్ డివిజన్‌లో అన్ని పోలీస్ స్టేషన్లతో పాటు లోకేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో కూడా విజయవంతంగా విధులు నిర్వర్తించారన్నారు. విధి నిర్వహణలో, శాంతి భద్రతల పరిరక్షణలో తనదైనా చెరగని ముద్రవేశారన్నారు. బదిలీపై వెళ్లిన చోట కూడా ఉత్తమ సేవలను అందించి ప్రజల హృదయాల్లో నిలిచిపోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు రాహుల్ గైక్వాడ్, అశోక్, రవీందర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రెట్టింపు లక్ష్యం..!



ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

- టార్గెట్ సాధనలో ఏఎంసీల వెనుకంజ
- తగ్గిన మార్కెట్ యార్డుల ఆదాయం
- ధాన్యం కొనుగోళ్లతో వచ్చే సెస్‌తోనే..
- వ్యవసాయ మార్కెట్ యార్డుల నిర్వహణ
- ఈసారి ఆదాయ లక్ష్యం మరింత పెంపు

సాక్షి, ఆదిలాబాద్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కొన్నేళ్ల కిందట వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ)లకు ఆదాయం రూ.50 కోట్ల నుంచి రూ.60 కోట్ల వరకు లభించేది. ప్రస్తుతం ఈ ఆదాయం సుమారుగా సగానికి పడిపోయింది. మార్కెటింగ్ శాఖ రాష్ట్ర అధికారులు ఇటీవల నిర్మల్ జిల్లాలో ఉమ్మడి మార్కెటింగ్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. గత మూడేళ్లలో ఏఎంసీలకు లభించిన ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుని దానిపై 20 శాతం పెంచేలా ప్రణాళిక చేశారు. త్వరలో ఈ లక్ష్యం ఖరారు కానుంది. అయితే లక్ష్య సాధనలో మార్కెట్ కమిటీలు విఫలమవుతున్నాయి.

ఎందుకీ పరిస్థితి..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పత్తి, వరి, సోయాబీన్, పప్పుదినుసులు, మొక్క జొన్న తదితర పంటల కొనుగోలుపై మార్కెట్ కమిటీలకు ఒక శాతం సెస్ లభిస్తుంది. దీని ఆధారంగానే ప్రతీ ఏడాది లభించే ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుని మార్కెటింగ్ అధికారులు ఏఎంసీల వారీగా ఆదాయ లక్ష్యాన్ని నిర్దేశిస్తారు. అయితే పత్తి కొనుగోళ్ల విషయంలో రెండేళ్లుగా ప్రైవేట్‌లో మద్దతు ధరను మించి ఉండడంతో భారత పత్తి సంస్థ (సీసీఐ) కొనుగోలు రంగంలో లేదు. అలాగే ఈ ఏడాది పత్తి ధర పెరుగుతుందన్న ఆశతో రైతులు పూర్తి స్థాయిలో పత్తిని విక్రయించలేదు. ఈ ప్రభావం మార్కెట్ సెస్‌పై పడింది. అంతేకాకుండా పలువురు రైతులు పత్తికి ఇక్కడి కంటే మహారాష్ట్రలో ధర అధికంగా లభిస్తుందని అక్కడికి తీసుకెళ్లి విక్రయించారు. ఈ ప్రభావం ఆదాయంపై అమితంగా కనిపిస్తోంది. ఉమ్మడి జిల్లాలో వరి మద్దతు ధరతో కొనడంతో దాని ద్వారా వచ్చే సెస్ యథావిధిగా వచ్చింది. అయితే ఈ నాలుగు జిల్లాల్లో పత్తి పెద్ద ఎత్తున కొనుగోలు జరిగే మార్కెట్ యార్డుల్లో ఈ ఏడాది కొనుగోళ్లు మందగించడంతోనే పరిస్థితి ఇలా ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

జిల్లాల వారీగా ఇదీ పరిస్థితి..

మరి కొద్దిరోజుల్లో ఈ ఆర్థిక సంవత్సరం ముగియనుంది. ఆదిలాబాద్ జిల్లాలో ఐదు మార్కెట్ కమిటీల ద్వారా 2022–23లో రూ.9.83 కోట్ల ఆదాయం వచ్చే పరిస్థితి ఉండగా 2023–24 ఆర్థిక సంవత్సరం ఆదాయ లక్ష్యం రూ.16.55 కోట్లు నిర్దేశించేలా ప్రణాళిక చేశారు. నిర్మల్ జిల్లాలోని ఐదు మార్కెట్ కమిటీల నుంచి ఈ ఏడాది రూ.11.20 కోట్లు ఆదాయం వచ్చే పరిస్థితి ఉండగా.. వచ్చే ఏడాది రూ.12.46 కోట్లు, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో మూడు మార్కెట్ కమిటీల్లో ఈ ఏడాది రూ.7.38 కోట్లు వచ్చే పరిస్థితి ఉండగా.. వచ్చే ఏడాదికి రూ.10.01 కోట్లు, మంచిర్యాల జిల్లాలో ఐదు మార్కెట్ కమిటీల్లో ఈ ఏడాది రూ.8.30 కోట్లు వచ్చే పరిస్థితి ఉండగా.. వచ్చే ఏడాది కోసం రూ.14.26 కోట్లు లక్ష్యం రావాలని ప్రణాళిక రూపొందించారు.

ఏఎంసీల వారీగా ఆదాయ లక్ష్య ప్రణాళిక

మార్కెట్‌యార్డు	లక్ష్యం
ఆదిలాబాద్	రూ.10.35 కోట్లు
ఆసిఫాబాద్	రూ.6.68 కోట్లు
చెన్నూర్	రూ.5.95 కోట్లు
భైంసా	రూ.5.45 కోట్లు
లక్సెట్టిపేట	రూ.3.65 కోట్లు
నిర్మల్	రూ.3.50 కోట్లు
కాగజ్‌నగర్	రూ.2.54 కోట్లు
బోథ్	రూ.2.22 కోట్లు
బెల్లంపల్లి	రూ.2.18 కోట్లు
ఖానాపూర్	రూ.1.80 కోట్లు
జైనథ్	రూ.1.58 కోట్లు
ఇంద్రవెల్లి	రూ.1.43 కోట్లు
మంచిర్యాల	రూ.1.27 కోట్లు
జన్నారం	రూ.1.20 కోట్లు
సారంగపూర్	రూ.1.20 కోట్లు
ఇచ్చోడ	రూ.97 లక్షలు
జైనూర్	రూ.79 లక్షలు
కుభీర్	రూ.51 లక్షలు

త్వరలో లక్ష్యాలు ఖరారు



మార్కెట్ల వారీగా 2023–24 సంవత్సరం ఆదాయ లక్ష్య ప్రణాళిక రాష్ట్ర అధికారుల వద్ద ఉంది. త్వరలో ఈ టార్గెట్‌కు సంబంధించి ఉత్తర్వులు వెలువడతాయి. పత్తి కొనుగోళ్లు ఆశించిన స్థాయిలో జరగకపోవడంతో మార్కెట్లకు పూర్తి స్థాయిలో ఆదాయం లభించలేదు. రాష్ట్ర వ్యాప్తంగా పత్తి కొనుగోళ్ల విషయంలో ఉన్న పరిస్థితే ఇక్కడా ఉంది. దీంతో ఆదాయం తగ్గింది.

– శ్రీనివాస్, డీఎంవో, ఆదిలాబాద్

ఆటోస్టాండ్ కాదు.. జిల్లా ఆస్పత్రి



ఆస్పత్రి ప్రాంగణంలోనే నిలిపిన ఆటోలు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని జిల్లా ఆస్పత్రి ఆటోలకు అడ్డాగా మారింది. వాహనాల పార్కింగ్‌కు స్థలం ఉన్నప్పటికీ ఆటోలను ఆస్పత్రి ప్రహరీ లోపల రోడ్డుపైనే అస్తవ్యస్తంగా ఉంచడంతో ద్విచక్ర వాహనాలపై వచ్చిన రోగులు ఇబ్బంది పడుతున్నారు. అంతేకాకుండా అంబులెన్సులు రావడానికి కూడా ఇబ్బందే అవుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రైవేటు వాహనాలు ఆస్పత్రిలోనికి రాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

టార్గెట్ 100 డేస్

- ఆదాయం పెంపునకు ఆర్టీసీ మరో ప్రయత్నం
- అన్ని బస్సులను రోడ్డెక్కించాలని నిర్ణయం
- ఈ నెల 23 నుంచి జూన్ 30 వరకు అమలు
- ప్రత్యేక కార్యాచరణతో ముందుకు

నిర్మల్ చైన్‌గేట్: ఆదాయం పెంపే లక్ష్యంగా ఆర్టీసీ మరో ప్రయత్నం ప్రారంభించింది. వందరోజుల పాటు ఆర్టీసీలోని స్పేర్ బస్సులు సహా మొత్తం బస్సులను రోడ్డెక్కించడంతో పాటు ప్రత్యేకంగా మార్పులు చేర్పులు చేసి ఆదాయం పొందేందుకు కసరత్తు చేస్తోంది. దీనికి రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ 'టార్గెట్ 100 డేస్'గా పేరు పెట్టింది. మార్చి 23 నుంచి జూన్ 30 వరకు దీనిని కొనసాగించాలని నిర్ణయించింది. ఇప్పటికే నిర్మల్, భైంసా ఆర్టీసీ డిపోల అధికారులకు ఆదేశాలు అందాయి. ఈ వంద రోజుల్లో ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు, డ్రైవర్లు అత్యవసరమైతే తప్ప సెలవులు పెట్టొద్దాని ఆదేశాలు ఉన్నట్లు తెలిసింది. వారాంతపు సెలవుల్లో ఆర్టీసీ సిబ్బంది పరిరక్షణ బృందాలుగా ఏర్పడి రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతంలో ఎక్కువ మందిని ఆర్టీసీ బస్సు ఎక్కేలా చూడాలని అధికారులు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు.

జిల్లాలో ఇలా...

జిల్లాలో భైంసా, నిర్మల్ ఆర్టీసీ డిపోలు ఉన్నాయి. భైంసాలో 79 బస్సులు, నిర్మల్‌లో 140 బస్సులు ఉన్నాయి. ఇందులో నిర్మల్ డిపోలో ప్రతీరోజు 60 వేల కిలోమీటర్ల వరకు బస్సులు తిరుగుతాయి. భైంసాలో 40 వేల కిలోమీటర్ల మేర ఆయా రూట్లలో బస్సులు తిరుగుతాయి. ప్రస్తుతం ఈ రెండు డిపోల పరిధిలో కిలోమీటర్‌కు రూ.42 వరకు ఆదాయం వస్తోంది. 100 రోజుల లక్ష్యంలో భాగంగా రూ.44 వచ్చేలా చూడాలని అధికారులు ఆదేశించినట్లు సమాచారం.

జిల్లాలో డిపోల వారీగా బస్సుల వివరాలు

బస్సుపేరు	నిర్మల్	భైంసా
పల్లె వెలుగు	72	63
ఎక్స్‌ప్రెస్	37	15
సూపర్‌లగ్జరీ	18	01
రాజధాని	06	00
డీలక్స్	07	00
మొత్తం	140	79




నిర్మల్ ఆర్టీసీ బస్టాండ్

ఆర్టీసీ వందరోజుల లక్ష్యాలు..

- ప్రతీ బస్సులో కనీసం నలుగురు నుంచి ఆరుగురు అదనంగా ఎక్కేలా డ్రైవర్, కండక్టర్ చూడాలి.
- ప్రయాణికులు ఎక్కువగా ఉన్నచోట రెండు నిమిషాల పాటు అదనంగా బస్సును ఆపాలి.
- వేసవిలో మధ్యాహ్నం పూట బస్సులను తగ్గించి రాత్రివేళల్లో సర్వీసులను పెంచాలి.
- రాత్రి వేళ ప్రజలు ఎక్కువగా ఉండే ప్రాంతాలకు అవసరమైతే మూడో షిఫ్టు పంపాలి.
- అద్దె బస్సులను కూడా అదనపు ట్రిప్పులకు ఉపయోగించుకోవాలి.
- విద్యార్థులకు పరీక్షలు పూర్తయ్యాక గ్రామాలకు తిప్పే బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో తక్కువగా ఉండే వాటిని గుర్తించి వాటిని రద్దీ ఎక్కువ ఉండే ప్రాంతాలకు మళ్లించాలి.
- డిమాండ్ ఎక్కువగా ఉండే రోజుల్లో టార్గెట్‌కు మించి కిలోమీటర్లు తిరగాలి. ఒకటి, రెండు పాయింట్లలో గ్రౌండ్ బుకింగ్ కోసం కండక్టర్లను పెట్టి, కండక్టర్ సర్వీస్‌లేని బస్సులను ఎక్కువగా తిప్పాలి.
- నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణికులను తరలించే ప్రైవేట్ వాహనాలపై చర్యలు చేపట్టడానికి రవాణా, పోలీసు అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలి.

లక్ష్యాలను చేరుకోవాలి



ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఆర్టీసీ ఆధ్వర్యంలో చేపట్టిన టార్గెట్‌ను రీచ్ కావాలి. డిపోను లాభాల్లోకి తెచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. ఉద్యోగులందరూ అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలి.

– సాయన్న, డిపో మేనేజర్, నిర్మల్

నైపుణ్యాలు గుర్తించి ప్రోత్సహించాలి

ఆదిలాబాద్‌టౌన్: తల్లిదండ్రులు పిల్లల్లోని నైపుణ్యాలు గుర్తించి వారిని ప్రోత్సహించాలని జిల్లా జడ్జి ఎంఆర్ సునీత సూచించారు. బుధవారం సాయంత్రం జరిగిన శ్రీసరస్వతి శిశుమందిర్ స్వర్ణోత్సవాలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. తల్లిదండ్రులు పిల్లలపై తమ అభిప్రాయాలు రుద్దడంతో వారు మనోవేదనకు గురవుతారని తెలిపారు. విద్యార్థులు లక్ష్యాలు నిర్దేశించుకుంటూ సాధనకు ముందుకుసాగాలని సూచించారు. పదో తరగతి వరకు మొబైల్ ఫోన్లు, టీవీలకు దూరంగా ఉండాలని, చదువుపై ప్రత్యేక దృష్టి సారిస్తే భవిష్యత్‌లో మంచి స్థానాలకు ఎదుగుతారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక నృత్యాలు ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ప్రణీత, పట్టణ ప్రముఖులు, ఆయా పార్టీల నాయకులు, పూర్వ విద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

మిస్సింగ్ కేసు నమోదు


సాయిచరణ్

ముధోల్: మండలంలోని బోరిగాం గ్రామానికి చెందిన మంచువార్ సాయిచరణ్ అనే విద్యార్థిని తండ్రి మందలించడంతో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. రెండు రోజు లుగా ఇంటికి తిరిగి రాకపోవడంతో బాలు డి తండ్రి పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశా డు. దీంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. విద్యార్థి దిలా వార్‌పూర్ మండలంలోని బీసీ హాస్టల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్నా డు. స్కూల్‌కు వెళ్లాలని తండ్రి మందలించడంతో ఇంటి నుంచి వెళ్లిపోయాడు.

వాహనం ఢీకొని జింక మృతి


మృతి చెందిన జింక

భైంసారూరల్: మండలంలోని తిమ్మాపూర్ గ్రామం వద్ద భైంసా–నిర్మల్ రహదారిపై గురువారం ఓ గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో జింక మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఫారెస్ట్ బీట్ అధికారి మీనా, ఎస్‌వో కోటేశ్, సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని జింక కళేబరాన్ని పరిశీలించారు. అనంతరం దాన్ని స్వాధీనం చేసుకుని ఖననం చేశారు.

తృటిలో తప్పిన ప్రమాదం

వాంకిడి: మండలంలోని సవాతి గ్రామానికి వెళ్లే రహదారిపై ఆర్లీ గ్రామ సమీపంలో పెను ప్రమాదం తప్పింది. మండల కేంద్రం నుండి సవాతి, ధాబా వైపు ప్రయాణికులతో వెళ్తున్న టాటా మ్యాజిక్ వాహనం ప్రమాదానికి గురైంది. సుమారు 10 మంది ప్రయాణికులతో వెళ్తున్న సమయంలో దొడ్డిగూడ గ్రామం వైపు నుంచి వాంకిడి వైపునకు వస్తున్న డిబిఎల్‌కు చెందిన ఓ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో టాటా మ్యాజిక్ వాహనం స్వల్పంగా దెబ్బతింది. ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.

శవమై కనిపించిన వృద్ధుడు

మందమర్రిరూరల్: ఈ నెల 12న ఇంటి నుంచి వంట చెరుకు కోసమని బయటకు వెళ్లిన సత్తయ్య గురువారం శవమై కనిపించాడు. ఎస్సై మహేందర్ వివరాల ప్రకారం... మండలంలోని చిర్రకుంట గ్రామానికి చెందిన కడియాల సత్తయ్య (62) సమీపంలోని అటవీ ప్రాంతానికి కట్టెల కోసం వెళ్లి తిరిగి రాలేదు. సత్తయ్య అప్పుడప్పుడు ఇంటి నుంచి బయటకు వెళ్లి నాలుగైదు రోజులకు ఇంటికి వచ్చేవాడు. అదే విధంగా వస్తాడని కుటుంబ సభ్యులు ఎదురుచూశారు. గురువారం గ్రామస్తులు అటవీ ప్రాంతానికి వెళ్లగా శవం కనిపించగా పోలీసులకు సమాచారమిచ్చా రు. ఎస్సై మహేందర్ చేరుకుని సత్తయ్యగా గుర్తించి కుటుంబీకులకు సమాచారం ఇచ్చా డు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


కాషాయ జెండాతో ట్రాక్టర్ పై కూర్చున్న చిన్నోడు


నిర్మల్‌లోని శోభాయాత్రలో నినాదాలు చేస్తున్న యువకులు


శోభాయాత్రలో ఛత్రపతి శివాజీ విగ్రహం

రాములోరి శోభాయాత్ర

- ప్రశాంతంగా ముగిసిన శ్రీరామనవమి
- నృత్యాలతో యువత కేరింతలు
- దారి పొడుగునా అన్నదానం, ప్రసాద వితరణ
- పోలీసుల భారీ బందోబస్తు

శ్రీరామనవమి సందర్భంగా శ్రీరాముడి శోభాయాత్ర ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గురువారం కనుల పండువగా కొనసాగింది. జైశ్రీరామ్ నినాదాలతో వీధులన్నీ మార్మోగాయి. యువత కాషాయ జెండాలు పట్టుకుని నృత్యాలు చేశారు. జై నినాదాలతో హోరెత్తించారు. యువతి యువకులు, రాజకీయ నాయకులు, ప్రముఖులు శోభాయాత్రలో పాల్గొని నృత్యాలు చేశారు. శ్రీరాముడి, ఛత్రపతి శివాజీ విగ్రహాలతో హిందూవాహిని ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. ఈ యాత్ర మార్గంలో వివిధ యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ప్రసాదం వితరణ చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నిర్మల్‌టౌన్/ భైంసాటౌన్/బోథ్:


సీతారాముల వేశంలో బాలలు


నిర్మల్‌లో నృత్యం చేస్తున్న యువతులు


శోభాయాత్రను ప్రారంభిస్తున్న ఏఎస్పీ కాంతి లాల్‌పాటిల్, బీజేపీ నాయకులు


బోథ్‌లో శోభాయాత్ర


ఆదిలాబాద్‌లో..


మంచిర్యాలలో..


భైంసాలో బందోబస్తు పరిశీలిస్తున్న ఎస్పీ ప్రవీణ్‌కుమార్, ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్


మంచిర్యాలలోని శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు


భైంసాలోని శోభాయాత్రలో నృత్యం చేస్తున్న నాయకులు


భైంసా శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

చెట్టు మీద గంజాయి

- ప్లాస్టిక్ డబ్బాలో పెంచుతున్న యువకులు
- రోజు గంజాయి సేవిస్తున్న వైనం
- బోథ్‌లో విచ్చలవిడిగా గంజాయి లభ్యం

బోథ్: గతంలో పోలీసులు దాడులు చేయడంతో గంజాయి పంట వేయడం, సరఫరా గత కొన్ని రోజులుగా బోథ్ మండల వ్యాప్తంగా తగ్గిపోయింది. ఇటీవల మళ్లీ బోథ్ మండల వ్యాప్తంగా సరఫరా అవుతోంది. మండల కేంద్రంలోని సాయినగర్‌ను ఆనుకుని ఉన్న వెంచర్‌లోని ఓ మామిడి చెట్టుకు పైభాగంలో కొంతమంది యువకులు ప్లాస్టిక్ డబ్బాలో మట్టిని నింపి అందులో గంజాయి మొక్కలను పెంచుతున్నారు. ప్రతి రోజు కొంతమంది యువకులు చెట్టు దగ్గరికి చేరుకుని గంజాయిని సేవిస్తున్నారు. చేనుల్లో సైతం ఎవరికంట పడకుంగా చెట్ల పైన డబ్బాల్లో గంజాయి మొక్కలు పెంచుతున్నట్లు తెలుస్తోంది.


చెట్టు మీద ఉన్న ప్లాస్టిక్ డబ్బాలు


ప్లాస్టిక్ డబ్బాల్లోని గంజాయి మొక్కలు

విచ్చలవిడిగా గంజాయి సరఫరా..

మండలంలో గంజాయి విచ్చలవిడిగా సరఫరా అవుతోంది. 10వ తరగతి మొదలుకుని విద్యార్థులు, యువకులలతో పాటు పలువురు గంజాయికి బానిసవుతున్నారు. మండల కేంద్రంలోని కల్లు బట్టీ దగ్గర, రాత్రి వేళల్లో స్థానిక పాత ప్రభుత్వ కళాశాల భవనం, పిప్పల్‌ధరి రోడ్డు, పెద్ద వాగు సమీపంలో, మోడల్ స్కూల్ వెనుక భాగంలో, పలు వెంచర్‌లల్లో గంజాయిని సేవిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా యువత గంజాయికి బానియ్యారు. బడికి వెళ్లాల్సిన విద్యార్థులు సైతం గంజాయికి అలవాటు పడటం ఆందోళన కలిగిస్తోంది.

పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టాలి..

యువత గంజాయికి బానిస కావడం ఆందోళన చెందే విషయం.. ఈ విషయంపై పోలీసులు ప్రత్యేక చొరవ చూపించాల్సిన అవసరం ఉంది. గంజాయి సరఫరాపై నిఘా పెట్టాలి. గతకొంత కాలంగా బోథ్‌లో గంజాయి సరఫరా చాపకింద నీరులా సాగుతోంది. నిరంతరంగా పెట్రోలింగ్ నిర్వహించాల్సిన అవసరం ఉందని, సాయంత్రం వేళల్లో గంజాయిని విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కల్లు బట్టీల వద్ద కొంతమంది విక్రయిస్తున్నట్లు సమాచారం.

పోలీసు కమాండ్ కంట్రోల్ భవనంలో చోరీ

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి రాంనగర్ బస్తీ ప్రాంతంలో కొత్తగా నిర్మాణం చేసిన పోలీసు కమాండ్ కంట్రోల్ రూమ్ భవనంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. అగంతకులు బుధవారం రాత్రి లేదా అంతకన్న ముందుగానే చోరీ చేసినట్లుగా తెలుస్తోంది. భవన నిర్మాణం చేసిన కాంట్రాక్టర్ కె.పద్మారెడ్డి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. కమాండ్ కంట్రోల్ రూమ్ భవనానికి అమర్చిన 10 టేకు తలుపులు, 14 ఫ్యాన్లు, ఇతర ఎలక్ట్రికల్ వస్తువులను గుర్తు తెలియని వ్యక్తులు తీసుకెళ్లారు. నాలుగేళ్ల క్రితం ఈ భవనాన్ని కాంట్రాక్టర్ పద్మారెడ్డి నిర్మాణం చేశారు. ఇంతవరకు పోలీసుశాఖ దీనిని స్వాధీనం చేసుకోలేదు. నిర్మాణం పూర్తయినప్పటి నుంచి ఖాళీగానే ఉంటోంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్ టౌన్ ఎస్‌హెచ్‌ఓ టి.శంకరయ్య తెలిపారు.

ప్రాణం తీసిన వేగం

- బాలుడు, యువకుడు మృతి
- బైక్‌తో ఆగి ఉన్న లారీని ఢీకొన్న వైనం
- పంపండుగ వేళ ఇరు కుటుంబాల్లో విషాదం



సంగెం శ్రీధర్, శ్రీహరి మృతదేహాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. వివరాల ప్రకారం... గుడిపేట గ్రామానికి చెందిన సంగెం శ్రీధర్ (చింటూ) (20), శ్రీహరి(14) ద్విచక్ర వాహనంపై రాత్రి వేళ బయటకు వచ్చారు. జాతీయ రహదారిపై స్పోర్ట్ బైక్‌పై అతివేగంతో వెళ్తూ బెటాలియన్ శివారులో లక్సెట్టిపేట వైపు వెళ్తున్న వెళ్తున్న లారీ జాతీయ రహదారిపై నిలిపి ఉండగా దానిని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ సంఘటనా స్థలం నుంచి పారిపోయాడు. సీఐ తోట సంజీవ్, హాజీపూర్ ఎస్సై ఉదయ్‌కిరణ్ సంఘటన స్థలానికి చేరుకుని రహదారిపై వాహన రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. మృతదేహాలను మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పండుగ వేళ ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొనగా ఆస్పత్రి ఆవరణం కుటుంబీకుల రోదనలతో మిన్నంటింది.